పులి ఆవు కథ తెలీని వాళ్ళుండరు. అయితే, ఆ కథలో నక్క మంత్రాంగం చేరితే 'ట్రాజెడీ' 'కామెడీ' అవుతుందని తెలుసా?

# ఇప్పటి పులీ ఆవూ కథ

వి. నరసింహమూర్తి



అనగనగా హిందీ మీడియంలో చదువుకొన్న ఒక తెలుగు పెద్దపులి వుండేది. దానికి తెలివి తక్కువ, ఆకలెక్కువ.

ఒక రోజు ప్రొద్దున్నే తెగ ఆకలేసింది దానికి.

"గాండ్రుం హై", "గాండ్రుం హై", అని అరుచుకుంటూ అడవంతా తెగతిరిగి, బ్రేక్‌ఫాస్ట్‌కి ఒక్క జంతువు కూడా దొరక్కపోయేసరికి, నిరాశతో "ఇంతేరా ఈ జీవితం" అని పాడుకుంటూ అడవి వదలి, అడవినానుకొని వున్న ఓ ఊరి పొలిమేరల్లో కొచ్చేసింది

దాని అదృష్టవశాత్తు ఓ లావుపాటి ఆవు ఒంటరిగా "జీవిత మె సఫలమూ" అని పాట పాడుకుంటూ. గడ్డి మేస్తూ కనిపించింది. దాన్ని చూసేసరికి పెద్ద పులికి నోరూరింది. "క్యా ఖూబ్ హై." క్యా ఖూబ్ హై" అనుకొంది హిందీలో. దాన్ని వాయిదాల పద్ధతిలో తింటే ఇంకెంత బావుండునో కదా అని కూడా అనుకుంది. వెంటనే దానిదగ్గర కెళ్ళి నిలబడి. "హల్లో మై డియర్" అని చిరునవ్వుతో పలుకరించింది దానిగొంతు వింటూనే ఆవు అంతెత్తు యెగిరి కిందపడి దుమ్ము దులుపుకుంటూ వణుకుతూ లేచి నిలబడి. దాన్ని చూసి "ఎవర్నువ్?" అని అడిగింది. అప్పుడు పులినవ్వి "ఇంకా నన్ను పోల్చుకోలేదా ?" అని అడిగి "అరే దీవానో. ముజ్ పహ్‌చానో" అంటూ పాట మొదలు పెట్టింది.

తరువాత ఆవు భయపడి. "తల్లివి నీవే. తండ్రివి నీవే- నన్ను కాపాడే దైవము నీవే" అని పాడుతూ దాని కాళ్ళమీద సాష్టాంగపడిపోయింది. "నీకు రెండు కాళ్ళెత్తి దండం పెడతాను! నన్నొదిలేయ్" అంది దీనంగా. దాని పాటలు, మాటలు వింటూనే పులికి నవ్వొచ్చింది. వెంటనే గట్టిగా హిందీలో నవ్వి "నిన్ను వదలి నేను పోలేనులే! ఇది నిజముగే!" అని వ్యంగ్యంగా పాడింది.

చూడు మిత్రమా నా సంగతి నీకు తెలీదు. నా ఆకలి సంగతి అసలు తెలీదు. అసలాకలి ఎంత భయంకరమైనదో నీకు తెలీదు. పిల్లలుపెట్టిన పెద్ద పులికి కళ్ళు కనబడవుట. అప్పుడది ఆకలికి తాళలేక మరో జంతువు తినేందుకు దొరక్క, తన పిల్లల్నే చంపి తినేస్తుందట ఇలా అని నేను పుట్టినప్పుడు మా అమ్మ చెప్పింది. అంతే! వెంటనే మా అమ్మ దగ్గర్నుంచి పారిపోయి ప్రాణాలు దక్కించుకొన్నాను. ఇంతకూ నేను చెప్పేదేమిటంటే.... "పెద్దపులిని చెప్పనీకుండానే ఆవు అడ్డుపడిపోయింది.


"నాకర్థమైంది ప్రభో! అర్ధమైంది! మీ ఆకలికి నా జోహార్లు! కానీ నా విషయం కూడా కొంచెం ఆలోచించు నేను ఒంటరి దాన్ని కాను. నా కోసం ఆకలితో ఎదుర్చూసే దూడ ఇంటిదగ్గరుంది.


ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డ నాకది. నువ్వు నన్నిప్పుడు బ్రేక్‌ఫాస్ట్‌కి తినేస్తే మరి నా దూడ ఫాస్ట్ సంగతేమిటి? ఆ తరువాత భవిష్యత్తులో దాని లంచ్, డిన్నరూ వగైరాల మాటేమిటి? అంచేత దయచేసి నన్నొదిలేయ్. కావాలంటే ఈ రోడ్డు వెంబడే ఓ మైలు వెళ్తే అక్కడో గొర్రెల మంద కనపడుతుంది. వాటిమీద పడు...." అంది ఆవు దీనంగా పులినవ్వి "చాలా థాంక్సోయ్! పోలీసులకు రహస్యాలంగ జేసే ఇన్‌ఫార్మర్స్‌లాగ నాకు నువ్వు గొర్రెల మందల వివరాలిచ్చి ఎంతో సహాయం చేశావ్. నీఋణం ఈ జన్మలో తీర్చుకోలేను నువ్వు ఇప్పటికిప్పుడు చచ్చి మరో జన్మ ఎత్తితేగాని నీ ఋణం తీర్చుకొనే అవకాశం నాకులేదు నువ్వెలాగూ అర్జెంటుగా చావలేవుగనుక. నేనే చంపేస్తాను" అంటూ పనిలేక పాడైపోయిన పంజాలు రిపేర్ చేసుకుని దాని మీదకు దూకబోయింది. "ఆగాగు..." అంటూ ఆవు వెనక్కు తగ్గింది. "ఎందుకూ?" అంది పులి "నువ్వెప్పుడైనా ఉరితీయబడ్డావా?" అన్న ఆవు ప్రశ్నకు తల అడ్డంగా ఊపింది పులి. "అందుకే నీకు ఆ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ తెలీవు చంపబడేవాడికి ఆఖరి కోరిక కోరుకొనే అవకాశం ఇవ్వాలి. లేపోతే జంతువులన్నీ నిన్ను వెలివేస్తాయ్. ఆలోచించుకో మరి."


"సరే నీ ఆఖరి కోరికేమిటి మరి?" అడిగింది పులి "నాలాంటి తల్లికింకేముంటుంది కోరిక. ఇంటికెళ్ళి ఓసారి నా దూడని చూసి కడుపునిండా పాలు తాగించి వచ్చేస్తాను. అంతే!"

పెద్దపులి ఘొల్లున నవ్వింది. ఎగిరి ముందు రెండు కాళ్ళతో తప్పట్లుకొట్టింది. "అహ్హహ్హ! నువ్వింటి కెళ్తావా. నేనంత తెలివి తక్కువ దాన్ననా నీ వుద్దేశం? ఒకవేళ అలాంటి వుద్దేశం వుంటే అది తప్పని నా వుద్దేశం." ఆవు భోరుమంది. "ఇంతేనా?" అంది దీనంగా "ఇంతే" అంది పులి.

"అవున్లే. కన్నపిల్లల్నే తినే నీకు నా మాతృహృదయం ఎలా తెలుసుంది?" అంది ఆవు రోషంగా కళ్ళనీరు కుక్కుకుంటూ. పెద్దపులికి జాలి కలిగింది. "సరే నీ మాటనమ్మి నిన్ను వదలిపెడతాననుకో, నువ్వు తప్పక తిరిగివస్తావని గ్యారంటీ ఏమిటి?" అనడిగింది అనుమానంగా— వదుల్తుందనే ఉద్దేశంతో ఆవు కొంచెం హుషారెక్కి "అమ్మతోడు. అబ్బతోడు నాతోడు. నీతోడు నేను అన్న టైముకి వచ్చేస్తా" అని పాట అందుకుంది. తర్వాత ఆవు అంతటితో ఆగక అంది. 'దేశమంతా కేవలం మాటనమ్మకం మీదే ఇన్ని అద్భుతాలు చేస్తోంటే నువ్వు ఆఫ్టరాల్ నీ బ్రేక్‌ఫాస్ట్ కోసం గ్యారంటీ అడుగుతావా? ఇవి మర్యాదస్తులు. అడవి నాయకులు చేసేపన్లు కాదు ఐనా నేనెవరను కొంటున్నావ్? సత్య హరిశ్చంద్రుడు వాళ్ళింట్లోవున్న ఆవు వంశం నాది. అలాటి వంశంలో పుట్టి నేనసత్య మాడతానా. నన్ను వదిలావంటే పావుగంటలో నీ ముందు నిలబడ్తాను నా మాట నమ్మి గ్యారంటీ లడక్కు" అంది తన వాచీ చూసుకుంటూ






పెద్దపులికి సత్యహరిశ్చంద్రుడంటె ఎవరో తెలీదు. ఆ విషయం ఆవుకెందుకు తెలియాలని-"సరే వెళ్ళిరా. కాని సరిగ్గా పావుగంటలో ఇక్కడుండాలి" అంది. ఆవు సంతోషంతో ఉక్కిరి బిక్కిరైంది. వెంటనే పులిచుటూ తిరుగుతూ "ఆ దేవుడెలా వుంటాడని ఎవరైనా అడిగితే మా పులిలాగా వుంటాడని చెబుతాను నేను." అంటూ పాడుతూనే ఇంటికెళ్ళిపోయింది.

పులి టైమ్ చూసుకుంటూ కూర్చుంది.

పావుగంట గడిచిపోయింది ఆవు రాలేదు. ఒకవేళ ఆ ఆవు వాచీ ఆగిపోయిందేమోలే అని సమర్థించుకొంటూండగా, ఆవు వెళ్ళిన వేపునుంచి నక్క వస్తూ కనిపించింది. వస్తూనే "ఏటి గురూ. ఇక్కడ కాపేసినావ్?" అనడిగింది. "ఆ! మరే [illegible] ఆవు దొరికిందిక్కడ. తిందామనుకుంటే [illegible] అదేమో దూడకు పాలిస్తానని తెగఏడ్చి. పావుగంటలో వస్తానని మాటిచ్చి ఇంటికెళ్ళింది. గంటైనా ఇంకా రాలేదేమా అని చూస్తున్నాను" అంది. నక్క ఘొల్లున నవ్వింది— నవ్వు ఆపుకోలేక కిందపడి దొర్లింది.

"ఏం. ఎందుకలా నవ్వుతావ్? ఆ ఆవు తిరిగి రాదంటావా. మరి అదివరకటి కథలో ఆ ఆవు తిరిగి వచ్చినట్లు, అప్పుడు పులి దాని సత్యసంధతకు మెచ్చి దాన్ని తినకుండా వదిలేసినట్లూ ఉందిగా. అఫ్ కోర్స్-అది తిరిగొచ్చినా నేను దాన్నొదలనుకో." అంది పులి

నక్క జవాబివ్వకుండా ఇంకా నవ్వుతూనే ఉంది. పులికి కోపమొచ్చింది.

"ఏయ్. నవ్వాపి సమాధానం చెప్తావా, లేక నీ సంగతి తేల్చమంటావా?" అంది లేచి నిలబడుతూ. నక్క నవ్వాపి "పిచ్చి మొఖమా! ఆ కథ నిజమే. కాని నీకు మాటిచ్చింది ఆవు కాదు, ఎద్దు. ఈ ఊళ్లో అసలు ఆవులే లేవు. అది ఆవో, ఎద్దో తెలీని ఎద్దు మొద్దుస్వరూపమైపోయావేం?" అంది నక్క, పక్కనే వున్న బొరియలోకి దూరుతూ. పులి ముఖం పాలిపోయింది ఇక తన ముఖం చూపడం ఇష్టంలేక అడవిలోకి పరుగెత్తింది. దాని తెలివి తక్కువతనానికి నక్క నవ్వుకొంది. అది ఆవని నక్కకి, ఆవుకి మాత్రమే తెలుసును.

